# ఆవకాయ మహోత్సవం

తలిసెట్టి రామారావుగారు మొట్టమొదట తెలుగు దేశానికి ఘాటైన వ్యంగ్య చిత్రాలు చవిచూపిన ఘనుడు.

ఆయన వ్యంగ్య చిత్రం ఒకటి ఈ రోజుల్లో- అంటే మే, జూన్ నెలల్లో తప్పకుండా జ్ఞాపకం వస్తుంది. దాని పేరు "ఆంధ్రుల ఆవకాయోత్సవం !"

ఒక రెండెడ్లబండిమీద పెద్ద పనసకాయంత మామిడికాయ నాలుగు పేటలుగా చీల్చి దానినిండా ఎర్రని ఆవకాయకారం కట్టుదిట్టంగా కూరితే - అది వికసిత సహస్ర కమలంలా నాలుగు చెక్కలూ నాలుగు మూలలకూ సమంగా విడి కన్నులపండువు సేయగా వూరేగింపు బయలుదేరుతుంది. బండిచుట్టూ ఆవకాయంటే ప్రాణం పెట్టే భక్త ఆంధ్ర జనం, ధోవతులు, లాల్చీలు, పాంట్లు, షర్టులు, పిలకలు, క్రాపులు అనే భేదం లేకుండా కలిసి

దట్టుగా ఆనంద తన్మయంగా పురుషులు నడుస్తూ వుంటే—స్త్రీలు అలంకృత పరిష్కృతలై గ్రామదేవత పండుగలో ఘటాల్లా చక్కని ఊరగాయ కుండలు తలపై పెట్టుకుని ఒయ్యారంగా నడుస్తూ ఉండగా ముందు సన్నాయి మేళం, చూడ ముచ్చటగా ఉంది.

నిజమైన ఆవకాయ సౌభాగ్యం— గోదావరిజిల్లాలో అందులోనూ-కోనసీమలో చూడాలి.

అందరికీ చిన్నా పెద్దా మామిడితోట లుంటాయి. ప్రతి తోటలోను ఆవకాయ చెట్టని ఒకటి విధిగా ఉంటుంది. వంశపారంపర్యంగా తాత అయిన తాత యెంచి దాని యోగ్యత నిర్ణయించి చప్పరించి మరీ వేసిన చెట్టది!

ఆవకాయ చెట్టు అహంకారం ఎలాంటిదంటే ప్రతి పొరుగు చెట్టూ రెండో పక్షమే.

15 రోజులు ప్రతిపెరడూ ఒక ఆవకాయ కార్ఖానా. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకూ రోకటి దెబ్బలతో ఆకాశం శబ్దగుణకం అయిపోతుంది.

వాతావరణం అంతా ఖారం!

ఇంటినిండా తుమ్ములు!

హైస్కూల్లో ఉద్యోగంచేసే రోజుల్లో ఒక హెడ్ మాష్టరుగారుండే వారు. స్కూల్లో ఉన్నంతసేపూ పగడైన తలపాగా, నిండుబొత్తాల ఆల్పాగా కోటూ, దానిపై రెండువైపులకూ జార్చిన జరీఖండువా, స్కూలు

రౌండ్స్‌కు వెళ్ళే ధీరోదాత్తగమనం, చూస్తే దగ్గరకు వెళ్ళడానికే భయంగా వుండేది.

అట్టి విద్యాధికారి ఆవకాయ రోజుల్లో పరమ శ్రోత్రియంగా మారి తెల్లవారు జామున నాలుగు గంటలకు లేచి పైన ఒక తువాలు, కింద ఒక పెద్ద అంగోస్త్రం ధరించి ఇంటికి వచ్చి 'శాస్త్రిగారూ, పదండి' అంటే – ఎక్కడికి? అని అడగకూడదు. ఎక్కడికో వినదమే మైలు దూరంలో కాల వవతల ఒకచెట్టు ఆవకాయకు ప్రశస్తమని ఎవరో చెప్పారు. అడ్డమైన చెట్టు ఆవకాయకు పనికిరాదని శాస్త్రం.

చెట్టు బాగా ముదరది. శాఖోపశాఖలుగా విస్తరించి ఆముక్తమాల్యదలో వటవృక్షంలా వుంది. భేష్ అనుకున్నారు మా మేష్టరుగారు. చెట్టు కాపలా మనిషిని లేవగొట్టారు. వంద ఇంతకని తెగ్గొట్టారు. ఒక్కరూపాయి పెప్పు తగిలించేటప్పటికి అతడు చెంగున చెట్టుమీదున్నాడు. 15 ఏళ్ళ కొడుకు గట్టి చిక్కం కట్టిన వెదురుగడ తండ్రికి అందించాడు.

కాయలుకోసి చిక్కంలో వెయ్యాలి. వేసినవి ఒక్కటీ కింద పడ కుండా అందుకున్న వాటిని చంటిపిల్లల్లా బుజ్జగించి బుట్టలో వెయ్యాలి. నేల మీద కాయ పడిందా దాని పని గోవిందా! దూరంగా పెట్టెయ్యాలి.

మేష్టరుగారు మొదటి చిక్కంలో నుంచి ఒక కాయ తీసి "ఆహా! ఏమి జాతండి! ఇలా ఉండాలి. ఆవకాయ అంటే– చర్మం తెల్లగా ఉండాలి. ముచిక దగ్గర రవంత పరుపు కనపడాలి. పీచుకు పీచూ, పులుపుకు పులుపూ, మొలిచి పెట్టుండాలి. ఈ కాయ చూడండి" అని కత్తితో ఒక బద్ద చీల్చి నా చేతిలో పెట్టారు. ముక్క నోట్లో వేసుకుంటే నసాళం అంటింది. పులుపు, నేను పులుపు తినలేను. బంగినపల్లి ఆవకాయ తినే రకం. నా ముఖంలో మెప్పు కనబడకపోతే రెండు ఇంక్రిమెంట్లు పోతా యన్నంత

భయం. కనుబొమ్మ లెగరేసి కళ్ళు పెద్దవిచేసి సాధ్యమైనంత మెప్పు నటించాను. ఇంకోముక్క నోట్లో వేసుకున్న మేష్టారు అర్ధనిమీలిత నేత్రులై నా మెప్పు స్వీకరించలేదు. ఎడ్యుకేషన్ స్టాండర్ట్స్ పడిపోతూన్నట్టే ఆవకాయ స్థాయి పడిపోతూన్నందుకు చాలా విచారించారు లోలోపల. స్కూలు టైం జ్ఞాపకంచేసి మేష్టార్ని ఆవకాయ తన్మయత్వంలోంచి విడదీసి గృహోన్ముఖులను చేశాను.

ఒకసారి కొత్తావకాయ రోజుల్లో పనిమీద రాజమండ్రి వెళ్ళి సుబ్రహ్మణ్యశాస్త్రిగారింట్లో మకాంచేశాను. రాత్రి శాస్త్రిగారితో పరమాహ్లాదంగా భోజనం—పిన్నిగారు వారం రోజులకిందట వేసి బాగా ఊరిన ఆవకాయ, తదితర జాతి ఉపజాతులు పేరుపేరు వరసనా వడ్డించి రుచి చూడమన్నారు. అక్కడ ఆడవారికి ఎవరెన్నిరకాలు ఎక్కువ పెడితే అంత ఘనత! అవి ఆప్తులు తిని మెచ్చుకుంటే కృతార్థత!

కొత్తావకాయ సిందూర తిలకంలా, శివుడి మూడో కన్నులా, జాజ్వల్యమానంగా వుంది. దానితో ఒక పెద్దవాయి కానిచ్చి తక్కిన 'వివిధ భారతి' తగు మాత్రంగా సంభావించి భోజనం ముగించాను.

భోజనానంతరం శాస్త్రిగారూ, నేనూ సాహిత్యం, కథలూ కబుర్లలో పడ్డాం. పది గంటలయింది. కన్ను పొడుచుకున్నా నిద్రరావడంలేదు. కళ్ళు మండుతున్నాయి. శాస్త్రిగారు కనిపెట్టారు. "ఆవకాయ వేడి, నిద్ర పట్టదు ; వుండండి." అని ద్రాక్షారిష్టం సీసా తీసి రెండు ఔన్సులు నీళ్ళలో కలిపి "పుచ్చుకోండి" అన్నారు.

చిరుచేదుగా తియ్యగా గొంతు దిగింది.

ఆవకాయ జోరు తగ్గి నిద్ర పట్టేసింది.